వైభవంగా బ్రహ్మోత్సవాలు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ఎంతో పేరొందిన చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయంలో సోమవారం 'హస్య వాహన సేవ'నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పుణ్యాహవనం, బిందె తీర్థం, బాల భోగం , బలిహరణం, మంత్రపుష్పం, మహానివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రొ.తిరుపతికి విద్యారత్న అవార్డు



ప్రొ.తిరుపతిని అవార్డుతో సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటుక రాజు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవం 2025 ఆధ్వర్యంలో సోమవారం క్లాసిక్ గార్డెన్‌లో విద్యారంగంలో సేవాలందిస్తున్న ప్రొ. ఏకూ తిరుపతిని విద్యారత్నా అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్, టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇటుక రాజు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల విద్యా అభివృద్ధికి ప్రొఫెసర్ తిరుపతి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఇలాంటి వారిని ముందుకు తీసుకొని ఆదర్శంగా సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కనకరాజు, సంగీతం రాజాలింగం, మేరీ మాదిగా, దేవిని సతీష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌ఏఎస్ తెలంగాణ ఉపాధ్యక్షుడిగా బత్తుల రవి



బత్తుల రవికి నియామక పత్రం అందజేస్తున్న జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు

నల్లకుంట: ద నేషనల్ అంబేడ్కర్ సేన(డీఎస్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నల్లకుంట తిలక్‌నగర్‌కు చెందిన బత్తుల రవి నియమితులయ్యారు. ఈ మేరకు టీఎస్‌ఏఎస్ జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు సోమవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు సేన జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు తాలూక రాజేష్, ప్రధాన కార్యదర్శి ఎస్. ప్రవీణ్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు. అంబేడ్కర్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి దళితులను ఐక్యం చేసి, హక్కుల సాధన కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు కృషి



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: డివిజన్‌లో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. సోమవారం పారిశుద్ధ్య నిర్వహణ, సమస్యపై జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులతో కలిసి ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని ఆయన సిబ్బందికి సూచించారు. అలాగే స్వచ్ఛ ఆటోలకు ప్రజలు చెత్తను అందజేయాలని ఆయన కోరారు. రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామన్నారు. మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ఆదేశించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్. ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (35) యాకుత్‌పుర – ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్!

- సర్కారు బడులు తెరిచేలోగా పాఠ్యపుస్తకాలు సిద్ధం
- పటిష్ట ప్రణాళికతో పంపిణీ చేయనున్న విద్యాశాఖ
- పంపిణీకి సిద్ధంగా.. పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు
- జూన్ 9 నుంచి 'బడిబాట'..
- అందులోనే స్కూల్ యూనిఫాంలతో పాటు పాఠ్యపుస్తకాల పంపిణీ



ప్రభుత్వ పాఠశాలలకు చేరుకున్న పాఠ్య పుస్తకాలు

బంజారాహిల్స్: 2025–26 నూతన విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలు తెరిచే లోపు సర్కారు బడుల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అన్ని పాఠశాలలకు ముందస్తుగానే పుస్తకాల సరఫరాకు చర్యలు చేపట్టింది. ఈ విద్యా సంవత్సరంలో ప్రణాళిక ప్రకారం ముందే పుస్తకాల ముద్రణకు శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ నుంచే ముద్రణ ప్రారంభమైంది. దీంతో పాఠ్య పుస్తకాలు అనుకున్న విధంగానే లక్ష్యానికి అనుగుణంగా సకాలంలో సర్కార్ బడులకు చేర్చారు.

- విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, షేక్‌పేట, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత, 48 ప్రాథమిక, 4 ఎయిడెడ్ స్కూళ్ల పరిధిలో విద్యార్థులకు సరిపడా పాఠ్య పుస్తకాలు సోమవారం చేరుకున్నాయి.
- షేక్‌పేట, ఖైరతాబాద్ మండలం–1, ఖైరతాబాద్ మండలం–2 రిసోర్స్ పర్సన్లు ఆయా పాఠ్య పుస్తకాలను సంబంధిత పాఠశాలలకు పంపించారు. ఇప్పటికే ఖైరతాబాద్–1, ఖైరతాబాద్–2 మండలాల పరిధిలో అన్ని స్కూళ్లకు పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తికాగా, షేక్‌పేట మండల పరిధిలో ఈ నెల 23వ తేదీలోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. అవసరమైన పుస్తకాల జాబితాను ఆయా పాఠశాలలు ముందే విద్యాశాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు వాటిని పంపించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో పార్ట్–1 పుస్తకాలు అందించనున్నారు. ఎస్‌ఏ–1 పరీక్షలు పూర్తయ్యాక సెప్టెంబర్, అక్టోబర్‌లలో పార్ట్–2 పంపిణీ చేయనున్నారు.

నేరుగా పాఠశాలలకే...

విద్యార్థులకు ఎలాంటి ఖర్చు లేకుండా రెండేళ్ల నుంచి రాత పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. సర్కార్ బడుల్లో ఇదివరకు ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థుల నుంచి ఇంటర్ వరకు చదివే వారికి ఉచితంగా రాత పుస్తకాలు అందజేశారు.

- ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక స్థాయి వారికి సైతం ఇవ్వనున్నారు. రాత పుస్తకాలు ఇదివరకు గోదాములకే చేరేవి. కానీ ఈ సారి నుంచి నేరుగా ముద్రణ కేంద్రం నుంచి పాఠశాలలకు చేరవేస్తున్నారు. ఇదిలా ఉండగా జూన్ 9వ తేదీ నుంచి బడి బాట కార్యక్రమం నిర్వహించనున్నారు. అప్పటి నుంచే విద్యార్థులకు స్కూల్ యూనిఫాంతో పాటు పాఠ్య పుస్తకాలు అందించనున్నారు. సర్కార్ బడుల్లో విద్యార్థులను చేర్పిస్తే అన్నీ ఉచితంగా ఇస్తారని తెలియజేయడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కలిగించేందుకు ముందస్తుగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయనున్నారు.

కొండా సహదేవ్‌కు కేంద్రమంత్రి అభినందనలు



కాచిగూడ: తైక్వాండోలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన కొండా సహదేవ్‌ను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సోమవారం బర్కత్‌పురలోని తన నివాసంలో సత్కరించి అభినందించారు. ఇటీవల కేబీఆర్ పార్కు ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో తైక్వాండోలో భారతదేశం నుంచి పది మంది సంయుక్తంగా ఒక గంటలో 56,400 కిక్స్‌ను ప్రదర్శించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ చేశారు. అందులో తెలంగాణ నుంచి కొండా సహదేవ్ పాల్గొని వరల్డ్ రికార్డు చేశారు. గిన్నిస్ బుక్ రికార్డు సర్టిఫికెట్ రావడంతో సహదేవ్ కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని బర్కత్‌పురలోని ఆయన నివాసంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీలలో కొండా సహదేవ్ పాల్గొని దేశానికి బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట మాజీ కార్పొరేటర్ వనం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించక ముందే పైపులైన్ వేయండి



కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బతుకమ్మకుంట వాసులు

అంబర్‌పేట: రోడ్డు నిర్మాణం కోసం చేపట్టిన పనులతో డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థ దెబ్బతిందని... తలెత్తిన ఇబ్బందులను పరిష్కరించాలంటూ బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డికి బతుకమ్మకుంట వాసులు వినతి పత్రం అందజేశారు. సోమవారం ఆమె కార్యాలయంలో కలిసి ఇటీవల రోడ్డు వేసేందుకు తవ్వకాలు చేపట్టడంతో డ్రైనేజీ పైపులైన్ ధ్వంసం అయ్యిందని వెంటనే కొత్త పైపులైన్ వేసి రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిందిగా వారు కార్పొరేటర్‌ను కోరారు. దీంతో కార్పొరేటర్ స్పందించి జలమండలి విభాగం అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు జెమ్మిశెట్టి బాల్‌రాజ్, బాలు తదితరులు ఉన్నారు.

రూ.1.29కోట్లతో పైపులైన్ పనులు ప్రారంభిస్తాం



మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో మంచినీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్‌తో కలసి ఆమె విలేకరులతో మాట్లాడారు. డివిజన్‌లో రూ.1.29 కోట్లతో నూతన పైపులైన్ నిర్మాణ పనులను చేపడుతున్నామని అన్నారు. డివిజన్‌లోని గోల్కొండ క్రాస్‌రోడ్డు నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు.. ఆంధ్రాకేఫ్ సమీపం నుంచి వీవీ గిరి నగర్ వరకు.. అరుంధతినగర్ బస్తీలో నూతన తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. కొన్ని రోజులుగా డివిజన్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సహకారంతో వాటర్ వర్క్స్ అధికారులపై ఒత్తిడి తెచ్చి నిధులను మంజూరు చేయించామని తెలిపారు.

బస్తీ దవాఖానాలో బాత్‌రూమ్స్ ఏర్పాటు చేయండి



బస్తీ దవాఖానాను సందర్శించిన కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: మౌలానా ఆజాద్‌నగర్ బస్తీ దవాఖానాలో బాత్‌రూమ్ వసతి లేక వైద్య సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్ అన్నారు. బస్తీ దవాఖానాను జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించారు. బస్తీ దవాఖానా వద్ద బాత్‌రూమ్స్‌తో పాటు షెడ్ ఏర్పాటు చేయాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్, బీజేపీ నేతలు బల్వీర్, శిరోసాగర్, అరవింద్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అరుంధతినగర్‌లో నేలకూలిన భారీ వృక్షం



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది, పరిశీలిస్తున్న బీజేపీ నేత వినయ్‌కుమార్

చిక్కడపల్లి: డివిజన్‌లోని అరుంధతినగర్‌లో ఆకస్మాత్తుగా భారీ వృక్షం సోమవారం నేలకూలింది. చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వెంటనే స్థానికులు కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్‌కు సమాచారం అందించడంతో ఆమె డీఆర్‌ఎఫ్, విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న డీఆర్‌ఎఫ్ మేనేజర్లు శ్రీను, సురేష్‌లు సిబ్బందితో కలసి చెట్టు కొమ్మలను తొలగించారు. విద్యుత్ శాఖ సీపీడీ ఏఈ నర్సింగ్‌రావు సిబ్బంది విద్యుత్ తీగలను క్రమబద్ధీకరించి సరఫరాను మెరుగుపరిచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బస్తీ వాసులు ఉమేష్, మెరుగుశ్రీనివాస్‌యాదవ్, స్వామిదాస్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత లింక్, యాప్స్ జోలికి వెళ్లొద్దు



సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమంలో నారాయణరెడ్డి, శరత్‌శ్యామ్ తదితరులు

కాచిగూడ: ఈస్ట్‌జోన్ సైబర్ సెక్యూరిటీ అండ్ నార్కోటిక్ డ్రగ్స్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ క్రిమినల్స్ రోజురోజుకు పేట్రేగిపోతూ నేరాలకు పాల్పడుతున్నారని... సైబర్ క్రిమినల్స్ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. సైబర్ క్రైమ్స్‌పై వస్తున్న వార్తలను నిశితంగా పరిశీలించి జాగ్రత్త పడాలన్నారు. మోసపూరిత లింక్, సైట్స్, యాప్స్ జోలికి వెళ్లొద్దని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు వి.జయపాల్‌రెడ్డి, రఘుబాబు, టి.మోహన్‌రావు, డాక్టర్ టీవీ రావు, సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఈస్ట్‌జోన్ అధ్యక్షుడు ఎస్. నారాయణరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.శరత్ శ్యామ్, ఆర్గనైజర్ శ్రీలత, సయ్యద్ ఖలేద్‌షా, ఫరీదుద్దీన్, వెంకట్, ప్రశాంత్, హఫీజ్, బసంత్ కౌర్, ఉస్మాన్, దస్తగిరి, సీనియర్ సిటిజన్లు, యువత పాల్గొన్నారు.

చిక్కడపల్లి ఏసీపీగా సీహెచ్ శ్రీకాంత్



చిక్కడపల్లి: చిక్కడపల్లి ఏసీపీగా పనిచేస్తున్న ఎల్.రమేష్‌కుమార్ బదిలీ అయ్యారు. మదాపూర్ ఏసీపీగా పనిచేసిన సీహెచ్ శ్రీకాంత్ చిక్కడపల్లికి ఏసీపీ బాధ్యతలు చేపట్టనున్నారు.

సమాచార కమిషనర్లుగా ఏ పార్టీకి చెందని వారు ఉండాలి

లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ సెక్రటరీ జనరల్ సామలరవీందర్



కాచిగూడ: రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్‌తో పాటు ఇటీవల ప్రభుత్వం నియమించిన కమిషనర్లలో ఒక సామాజిక ఉద్యమకారుడిని లేదా ఒక బీసీని నియమించకపోవడం బాధాకరమని లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ సెక్రటరీ జనరల్ సామల రవీందర్, జూనియర్ న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వంశీకృష్ణ అన్నారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఇక ముందు నియమించే ఇద్దరు కమిషనర్లనైనా ఉద్యమకారులు, బీసీలను నియమించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు నియమించిన వారిలో అందరూ అగ్రవర్ణాలకు చెందిన వారే ఉన్నారని అన్నారు. దీంతో ప్రభుత్వంపై బీసీల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతోందని అన్నారు. సమాచార కమిషనర్లుగా ఏ పార్టీకి చెందని వారు ఉండాలన్నారు. ఒక న్యాయవాది, ఒక సైంటిస్ట్, సమాజిక ఉద్యమకారులు ఉండాలని కాని ప్రభుత్వం అలా నియమించలేదని ఆరోపించారు. ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసినా ఆచరణలో మాత్రం అది కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న బీసీ వ్యతిరేక చర్యలను బీసీలు సంఘటితంగా తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి పి.సుధాకర్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి తంగెళ్ళమూడి నందగోపాల్, అడ్వొకేట్ తిరుమల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహన్ని ఎండోమెండ్ పరిధి నుంచి తొలగించాలి

మున్నూరుకాపు వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొ. మ్యాడం వెంకట్‌రావు

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధి నుంచి వెంటనే తొలగించి మున్నూరుకాపులకు అప్పగించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కాచిగూడలోని ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు పిల్లి శ్రీనివాస్ రావు, పన్నాల విష్ణువర్ధన్, అమరం చంద్రశేఖర్, ఎలగందుల దేవేందర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కొందరు తమ స్వలాభం కోసం మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహాన్ని ఎండోమెంట్ (దేవాదాయ, ధర్మాదాయ శాఖ) తీసుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి, ఎండోమెంట్ శాఖ మంత్రి కొండ సురేఖకు, ఎండోమెంట్ కమిషనర్‌కు లేఖలు అందజేయడం పట్ల తీవ్రంగా ఖండించారు.

◆ ముఖ్యంగా ట్రస్ట్‌బోర్డు సభ్యుడిగా తొలగించబడిన ఆకుల పాండురంగారావు కొంత మందిని కలుపుకుని విద్యార్థి వసతి గృహానికి వ్యతిరేకంగా పనిచేస్తూ మున్నూరుకాపు పేద విద్యార్థుల జీవితాల్లో మట్టికొట్టాలని చూస్తున్నారని అన్నారు. అలాంటి వారిపై త్వరలోనే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ఎండోమెంట్ పరిధిలోకి వెళ్తే ప్రతి ఏటా దాదాపు రూ.40 లక్షల వరకు ఆదాయం ఎండోమెంట్‌కు వెళ్తుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మ్యాడం వెంకట్‌రావు

దీంతో మున్నూరుకాపు విద్యార్థులకు అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.


◆ నిబంధనలకు విరుద్ధంగా ట్రస్ట్‌బోర్డు అనుమతి లేకుండా పాండురంగారావు నేతృత్వంలో నడుస్తున్న కంప్యూటర్ సెంటర్‌ను మూసివేయనున్నట్లు వారు తెలిపారు. ట్రస్ట్ బోర్డులో ఇప్పటి వరకు ట్రస్ట్‌బోర్డు ఎలాంటి అవినీతి అక్రమాలు జరగలేదన్నారు. అలా జరిగినట్లు ఎవరైనా రుజువు చేస్తే వెంటనే తాము తప్పుకుంటామని వారు పేర్కొన్నారు.

◆ ట్రస్ట్ బోర్డుకు సంబంధించిన ఒక్క రూపాయి కూడా మిస్ యూజ్ జరగలేదన్నారు. కావాలనే పనిగట్టుకుని మున్నూరుకాపులను, ప్రభుత్వాన్ని, మంత్రులను తప్పుదోవ పట్టించే విధంగా ప్రయత్నాలు చేస్తున్న వారిపట్ల మున్నూరుకాపులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్నూరుకాపు విద్యార్థుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ట్రస్ట్ బోర్డు పనిచేస్తుందని వారు పేర్కొన్నారు.

అలరించిన సంగీత విభావరి

చిక్కడపల్లి: శ్రీ రాజరాజేశ్వరి మ్యూజికల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు గోవింద రావు నిర్వహణలో సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో 'నాడు – నేడు'శీర్షికతో నిర్వహించిన తెలుగు, హిందీ సినీ సంగీత విభాగంలో ఆలపించిన పాటలు సభికులను అలరించాయి. గాయకులు తండ్రి ఎం.యాదగిరి, కూతుర్లు చిన్నారులు అక్షర, చతురలు ఆలపించిన అన్నమాయ్య భక్తి గీతాలు, లత మంగేష్కర్ పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గాయకులు సుందర్‌రావు, శైలజ శ్రీనివాస్, వసంత దీప్తి, సినీ ప్లేబ్యాక్ సింగర్ చంద్రతేజ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ



చిక్కడపల్లి: ఓ షాప్ ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచే సుకుంది. ఆసిఫ్‌నగర్ దత్తాత్రేయనగర్‌కు చెందిన న్యూస్ పేపర్ ఏజెంట్ సంపత్‌కుమార్ (35) చిక్కడపల్లి ప్రధాన రోడ్డులోని తన షాపు ముందు యాక్టివ్ (టీఎస్ 13ఈక్యూ1987) వాహనాన్ని సోమవారం ఉదయం పార్కు చేశాడు. న్యూస్ పేపర్ల దుకాణానికి వెళ్లి బయటకు వచ్చేసరికి వాహనం మాయం అయ్యింది. నిమిషాల వ్యవధిలో తన ద్విచక్ర వాహనం మాయం అవడంతో వెంటనే చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చిక్కడపల్లి పోలీసులు షాపు వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా ఆర్టీసీ క్రాస్‌రోడ్డు నుంచి ముషీరాబాద్ వైపు ఆ వాహనంపై వెళ్లినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేదల పక్షపాతి పుచ్చలపల్లి సుందరయ్య

- పోరాటాలు కొనసాగించడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ





సుందరయ్య పార్కులో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, వాకర్స్ క్లబ్ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ స్వాతంత్ర పోరాట యోధుడు, పేదల పక్షపాతి, పుచ్చలపల్లి సుందరయ్య చేసిన పోరాటాలను కొనసాగించడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సోమవారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఉత్తమ పార్లమెంట్ సభ్యులు సుందరయ్య 40వ వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

◆ అనంతరం జాన్ వెస్లీ మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించడంతో పాటు కార్మిక, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేశారని అన్నారు. ప్రతిపక్ష హోదాలో సైతం సైకిల్ మీద పార్లమెంట్‌కు వెళ్తూ ఆదర్శ నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. పిల్లలు పుడితే స్వార్థం పెరుగుతుందనే భావనతో సమాజ శ్రేయస్సు కోసం తన భార్యను ఒప్పించి కుటుంబ నియంత్రణ చేయించిన మహా మనిషి అని గుర్తుచేశారు.

◆ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ... సంపన్న కుటుంబంలో పుట్టినప్పటికీ పేదల పక్షపాతిగా మారారని అన్నారు. కుల నిర్మూలన పోవాలనే ఉద్దేశంతో దళితులతో సహపంక్తి భోజనం చేశారని గుర్తుచేశారు. పేరులో ఉన్న రెడ్డి అనే పదాన్ని తొలగించి సుందరయ్యగా పేరు మార్చుకున్న ఆదర్శమూర్తి అని కొనియాడారు. వాకర్స్ క్లబ్ కోశాధికారి ఎం.దశరథ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు కళ్యాణ్ నాయక్, నాయకులు విభూది నాగభూషణం, సంపత్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, ఎస్.రమేష్ రెడ్డి, టి.స్కైలాబ్ బాబు, కోటా రమేష్, పి.సాగర్, ఏ.శ్రీనివాస్‌రెడ్డి, పి.ఆశయ్య, వంగూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య



సదస్సులో మాట్లాడుతున్నా ప్రొ.చమల్ లాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గొప్ప పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని జేఎన్‌యూ రిటైర్డ్ ప్రొఫెసర్ చమల్ లాల్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా నేటి రాజకీయాలు – భగత్ సింగ్ ప్రాసంగిక అనే అంశం పై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చమల్ లాల్ మాట్లాడుతూ.. లాటిన్ అమెరికా ప్రతిబింబంగా చేగువెరాను ఎలా చూస్తారో దక్షిణాసియాకు భగత్ సింగ్ విప్లవతారగా ప్రకాశిస్తారని అన్నారు. 1970లో మొదటి సారిగా భగత్‌సింగ్ రచనలు వచ్చాక మరో కోణంలో కూడా ఆయన గురించి ఆలోచించడం ప్రారంభమైందన్నారు. ఎస్వీకే ట్రస్టు అధ్యక్షులు బీవీ రాఘవులు అధ్యక్షతన ఈ కార్యక్రమంలో ఎస్వీకే కార్యదర్శి ఎస్. వినయకుమార్, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.